“ఏమి చరిత్రో ఏమిటో....? ఓ ప్రక్క చలికి చస్తుంటే మీ గోలొకటి.... ఎవరి దగ్గరన్నా గోల్డ్‌ఫ్లేక్ కింగ్ సైజుందా?” దయాళ్ అనే విద్యార్థి తల పైకెత్తి ఓరగా చూస్తూ అడిగాడు.

“అడుక్కునేవాడికెక్కూడా స్టయిల్....! సిగరెట్ ఫ్రీగా కావాలి. అదేడవ్వొచ్చుగా.... కింగ్ సైజట పైగా? ఆ చూపులు చూడు ఒంటికన్ను శివరాసన్‌లా...?” మధుకర్ దయాళ్ వైపు మిర్రి మిర్రి చూస్తూ అన్నాడు.

“ఒక జోక్ చెప్పరా... సిగరెట్ ఇస్తాను” అన్నాడు సురేష్ జేబులోంచి సిగరెట్ పెట్టె తీస్తూ.

నిజానికి దయాళ్‌కి ఆస్తిపాస్తులు బాగానే వున్నాయి. కాని అదోరకమైన బుద్ధి..... ఫ్రీగా వచ్చిందే గొప్ప తృప్తినిస్తుందని అతని నమ్మకం.

అతని అసలు పేరు నిధి దయాళ్. చూట్టానికి స్టూడెంట్‌లా ఉండడు. ఐదడుగుల ఆరంగుళాల ఎత్తులో పెట్రోలు పీపాలా వుంటాడు. క్రింద నుంచి పైవరకు ఒకటే షేప్.

ఎప్పుడెవరు, ఏది ఫ్రీగా ఇస్తారా అని ఎదురు చూస్తుంటాడు.

ఇతరుల్ని మోసగించటం అతనికి వెన్నతో పెట్టిన విద్య.

మోసగించింది కాక, ఎలా మోసగించింది నలుగురికి చెప్పి తన తెలివి తేటలకి తనే మురిసిపోతుంటాడు.

“ఒక పోలీస్ స్కూటర్ మీద తన భార్యతో షాపింగ్‌కు వెళ్తున్నాడట.... చాలా వేగంగా.... కొంత దూరం వెళ్ళాక అతని భార్య స్కూటర్ మీంచి జారి పడిపోయింది. దారిన వెళ్ళే ఒక వ్యక్తి ఆ దృశ్యాన్ని చూసి, అంతకంటే వేగంగా వెళ్ళి ఆ విషయాన్ని ఆ పోలీసుకి చెప్పాడట-- అప్పుడా పోలీసు ఏమన్నాడో తెలుసా?”

“ఏమన్నాడు? పీడ విరగడయిందనా?”

"అయ్యో అనా?"

"వెనక్కి తిరిగి పరిగెత్తుకెళ్ళి భార్యకు సారీ చెప్పాడా?"

తలా ఒక రకంగా ఊహించారు.

సురేష్ చేతిలోంచి సిగరెట్ తీసుకొని స్టయిల్‌గా దాన్ని వెలిగించుకుని ఒక దమ్ము లాగి--

"నేనింకా చెవిటివాడ్నేమో అని భయపడ్డాను- అని అన్నాడట" అన్నాడు నిధి దయాళ్ తాపీగా.

"దిక్కుమాలిన కుంకకి ఇన్ని చావు తెలివి తేటలెలా వచ్చాయో?" అన్నాడు మధుకర్ వడివడిగా నడుస్తూనే.

మరికొద్దిసేపటికి అందరూ టిప్పుసుల్తాన్ సమ్మర్ ప్యాలస్ ముందున్న బస్ వద్దకు వచ్చారు.

అక్కడికి వస్తూనే మేరీ కోసం విజయ్ కళ్ళు ప్రతి అంగుళాన్ని గాలించాయి.

సరిగ్గా అదే సమయంలో బస్‌లో విండో ప్రక్క కూర్చున్న మేరీ కావాలనే గొంతు సవరించుకుంది. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. కళ్ళతోనే వంద పేజీల్లో ఇమిడివుండే భావాన్ని ఎక్స్ఛేంజ్ చేసుకున్నారు.

గొప్ప ప్రగతి.... గ్రేట్ ఎచీవ్‌మెంట్?!

మరికొద్ది సేపటికి బస్ బయలుదేరింది. మధుకర్ ఓరగా, ఎవ్వరికీ అనుమానంరాని విధంగా మహతి కేసి చూశాడు.

ఆమె దీక్షగా చదువుకుంటూ కనిపించింది.

ఆ పుస్తకంవైపు మధుకర్ పరిశీలనగా చూశాడు.

ఆమె చేతిలో అమెరికన్ హీరో - అమెరికన్ ఆటోమొబైల్ ప్రపంచాన్ని రాడికల్‌గా చేంజ్ చేసిన లీ అయెకోకా ఆటో బయోగ్రఫీ బుక్ వుంది. అతనెవరయిందీ మధుకర్‌కి అర్థం కాలేదు.

*  *  *  *

బ్రతకలేమోనన్న భయం.... బ్రతికినా నలుగురితో సమానంగా, సమానస్థాయిలో బ్రతకలేమోనన్న భయం... రేపు నాకెలా గడుస్తుంది...? ఎల్లుండి నా పరిస్థితేమిటి...? అనే ఆదుర్దా... నష్టం మైనస్ లాభం, సుఖం మైనస్ దు:ఖం సంభవిస్తుందని తెలిసినప్పుడు ఏర్పడే ఆకస్మిక భీతి.... perpetual Insecurity....... అనిశ్చిత భావం... ఫియర్...... యాంగ్జయిటీ.... ప్యానిక్ డిజార్డర్ ....... అంతా ట్రాష్... తలుచుకుంటే వాటిని గెలవటమేం? ఆత్మస్థయిర్యమున్నప్పుడు, ఆత్మవిశ్వాసం ఆయుధమైనప్పుడు.. విశ్వాసం స్వంతమైనప్పుడు? శారీరకమైన వైరస్‌ల్ని తొలగించుకోవటం తేలిక...... అదే మానసిక వైరస్‌ల్ని దూరం చేసుకోవటం కష్టం.

నెగెటివ్‌గా ఆలోచించే వాళ్ళకు-- నిరాసక్తత, నిర్లిప్తతతని ఆశ్రయించి, ముసుగెట్టి పడుకొనే వాళ్ళకు- నష్టపోయినవాడు దెబ్బతిన్నవాడే ఉదాహరణగా కనిపిస్తాడు. జీవితంలో నష్టపోయినవార్ని, సర్వం కోల్పోయినవార్ని ప్రత్యక్షంగా చూసి భయపడిపోతాడు.

ఆబ్జక్టివ్ స్టిమ్యులస్..... ఫలానావాడు అయిపోయాడట, నష్టపోయాడట, ఆరిపోయాడట అని విని మరోసారి భయపడిపోతారు.

సబ్జెక్టివ్ స్టిమ్యులస్.... ఇక, ఈ మానసిక రుగ్మతల్నే మనిషి పూర్తిగా జీవితాన్ని ఆక్రమించుకుపోతే ఇక సాధించేదేమిటి? ఒరగబెట్టేదేమిటి?

*  *  *  *

బెంగుళూరులో బస్ బయలుదేరిన ఐదుగంటలకి కొడగు జిల్లా పరిధిలోకి ప్రవేశించింది.

చిన్న చిన్న పర్వత శ్రేణులు ఆకుపచ్చ పట్టు తివాచీని మీద పర్చుకున్నట్లున్నాయి. మనోహర దృశ్యం...... మనస్సును భావోద్వేగానికి గురిచేసే పసిడి దృశ్యం.

అప్పటివరకు బస్సులో నానా అల్లరి చేసిన విద్యార్థిని, విద్యార్థులు తలలు పక్కకి తిప్పి కనులపండుగగా కనిపిస్తున్న దృశ్యాన్ని తిలకించటంలో తన్మయులయిపోయారు.

బస్ మరో అరగంట ప్రయాణించాక కుషాల్‌నగర్ టౌన్‌లోకి ప్రవేశించి డీజిల్ కోసం బంక్ ముందాగింది.

అక్కడినుండే ప్రకృతి అందాలకు అద్దంపట్టే కూర్గ్--నిజమైన పరిసరాలు ఆరంభమౌతాయి.

పదినిముషాలకు తిరిగి బస్సు బయలుదేరింది. కుషాల్‌నగర్ సరిహద్దులు దాటగానే మొదలయ్యాయి కాఫీతోటలు...

అక్కడక్కడా వాటి  మధ్య రిజర్వ్‌డ్ ఫారెస్ట్.

ఆ ఫారేస్ట్‌లో వరుసగా వేల సంఖ్యలో ఉన్న టేకువృక్షాలు నిలువెత్తు పొదలు.... పచ్చికబయళ్ళు..... ఐదడుగుల ఎత్తులో పొదల్లా కనిపించే కాఫీ మొక్కలు. వాటి మధ్య నీడ కోసం పెంచిన తునిసి, కొడిసి, దేవదారు, సింధూర, జమ్మి, బండారు , ఏగిస చెట్లు.... వాటికి అల్లుకుపోయిన పెప్పర్ క్రీపర్స్ (మిరియాల మొక్కల తీగలు) యేలకులు, జీడిమామిడి వృక్షాలు.

అందమైన ఆడపిల్ల వాలుజడ పాయల్లా మెలికలు తిరిగిన రోడ్లు లోయలు... శిఖరాలు.... చల్లని ఈదురుగాలులు.... చిరుజల్లులు....

మధ్య మధ్యలో బెంగుళూరు పెంకుల కప్పులతో కనిపించే చిన్న చిన్న ఇళ్ళు... సన్నటి ఎర్రమట్టి కాలిబాటలు... ఫీస్ట్ టు ఐస్.... రెండు కళ్ళూ చాలవు.... కొండల్ని మధ్యగా తొలిచి దారిచేసినట్లున్న రోడ్, పొగమంచుకి, చిరుజల్లుకి తడిసి మెరుస్తోంది. రోడ్‌కి ఇరువైపులా ఎర్రమట్టి ఒడ్లు ... విరిగి రోడ్ మీద పడతాయేమోనన్నట్లుగా ఉన్నాయి. ముదురు ఆకుపచ్చ కాఫీ మొక్కలు జూలై నెలకి చిగుర్లు తొడిగి, కంది గింజ  పరిమాణం గల కాఫీకాయల్ని కలిగివుంటాయి. గుత్తులు గుత్తులుగా కాయలు.

ఆ ప్రకృతిని చూసి పరవశించనివార్ని గిరీశం మాటల్లో చెప్పాలంటే ఉత్త వెధవాయిలు.... బడుద్ధాయిలు... ఒకింత కరకుగా చెప్పాలంటే దున్నపోతులు, దున్నపోతుల మీద పడే చిరుజల్లు.... పొగమంచు... తడిసిన నేలవాసన ఏ అనుభూతిని కలిగించగలవు?

వర్షపు చినుకుల్ని సమ్మిశ్రితం చేసుకున్న పొగమంచు ఆ పర్వత శ్రేణుల్ని కమ్ముకుపోయి ఉంది. ఉండుండి చిరుజల్లు.... అది పెరిగి కొద్దిపాటి వానగా మారి బద్ధకంగా కురుస్తోంది.

బలిష్టంగా, ఆరోగ్యంగా ఉన్న ఆ ప్రాంత ప్రజలు రెయిన్‌కోట్స్, హేట్స్‌తో అక్కడక్కడా కనిపిస్తున్నారు... హడావిడిగా వాళ్ల వాళ్ళ పనుల్లో నిమగ్నమై తిరుగుతున్నారు. మహతి పరిసరాల్ని, బాహ్యప్రపంచాన్ని ఎప్పుడో మరిచిపోయింది. తియ్యటి భావోద్వేగపు ప్రకంపనాలు ఆమెను పరవశింపచేస్తున్నాయి. సౌతిండియన్స్ స్విట్జర్లాండ్....... ఎస్.... ఘాట్‌రోడ్.... ఎత్తైన ప్రదేశానికి ఎక్కుతున్న బస్సు స్ట్రెయిన్ తీసుకుంటోంది.

అంతలో కనిపించింది మర్కెరా ఒన్ కిలోమీటరు అన్న బోర్డు... తుప్పుపట్టిన ఐరన్‌షీట్ మీద తెల్లటి అక్షరాలు..

కూర్గ్‌జిల్లా హెడ్ క్వార్టర్స్.... ది లాండ్ ఆఫ్ ది మిలటరీ జనరల్స్.

కరియప్ప, తిమ్మయ్యలాంటి అసాధారణ మిలటరీ జనరల్స్ జన్మస్థలం అది. ధైర్యసాహసాలు, నీతి నిజాయితీలు ఆ ప్రాంత ప్రాజల సొత్తు....

మరో పదినిముషాలు ప్రయాణించిన బస్సు కూర్గ్ ఆర్. టి. ఓ. ఆఫీస్ ముందాగింది.

ఆకుపచ్చగా కనిపించే అనంతమైన పర్వతశ్రేణులపైకి దృష్టిని సారించిన కొద్దీ నీలిరంగుకి మారి, ఆ పైన వెండి రంగు మబ్బులతో కలిసి పోయి నింగి నేల ముద్దాడినట్లున్న అపురూప దృశ్యం.

కొండలపై మెట్లు నిర్మించినట్లుగా ఉన్న చిన్న చిన్న ఇళ్ళు... వాటిముందు ప్రకృతే పరిచినట్లున్న పచ్చటి లాన్స్... ఇంత అందమైన, అద్భుతమైన ప్రదేశాలు ఇక్కడే ఉన్నాయా! మన దేశంలోనే?!

ఇంటిచెట్టు వైద్యానికి పనికిరాదా?

వస్తుంది. చూడగలిగే కళ్ళు, అనుభూతించగలిగే మనసు ఉంటే పనికివస్తుంది.

ఇదేనేమో స్వర్గం అంటే... ఈడెన్ ఆఫ్ ది నేచురల్ లవర్స్షాంగ్రిలా ఆఫ్ ది నాన్ మెటీరియలిస్టిక్ ఎమోషనల్ పీపుల్.

"బస్ నుంచి ఏం ఎంజాయ్ చేస్తాం...? చలికి చచ్చిఊరుకుంటాం" నిధి దయాళ్ అన్నాడు.

"అమ్మో జలుబో.... ఫ్లూనో...... న్యుమోనియానో వస్తుంది" మరొక రన్నారు.

నవ్వుకుంది మహతి వారి అసహనాన్ని, అసంతృప్తిని చూసి.

పూర్ క్రీచర్స్......

వీళ్ళలో ఏ భావమూ నిజమైనది కాదు.

ఏ ఫీలింగ్కి ఫర్ ఫెక్షన్ ఉండదు.

దేవుడి గర్భగుడిలోకి వెళ్ళినా, చేతివేళ్ళ ఉంగరాల్ని- ఉన్నాయో, లేవో అని తడుముకొనే పిచ్చి జనం....

పుట్టింది కేవలం తిండి , నిద్ర, సెక్స్, పేరు ప్రతిష్టలు, సంపాదన, ఆత్మవంచనకే అనుకొనే నిర్భాగ్యులు.

స్పందించే హృదయాన్ని సమాధిచేసుకున్న పుట్టదరిద్రులు, అనెమోషనల్ అంధులు....

బస్ దిగుతూనే అందరూ ప్రక్కనే వున్న షాప్స్‌లోకి వెళ్ళి తడవకుండా తలదాచుకుంటుంటే మహతి అంగుళమైనా కదల్లేదు. వర్షపు నీరు సన్నటి నీటిపాయలుగా కాళ్లమధ్యనుంచి ప్రవహిస్తోంది.

వాటిమధ్య తన సున్నితమైన పాదాల్ని అడ్డుపెట్టి ఆడుకుంటోంది చిన్నపిల్లలా, చిన్ని ప్రవాహాన్ని ఆపి వదులుతోంది. తడుస్తోంది. ఆస్వాదిస్తోంది, అనుభూతిస్తోంది.

ఆమె నల్లటి, చిక్కటి జుత్తు తడిచి పసిడివన్నెల పాలరాయిలాంటి ఆమెవీపుమీద పర్చుకుపోయి నీరును ఒడుస్తోంది.

ఆమెకు ఒకింత దూరంలో ఉన్న మధుకర్ ఆమెకేసి కన్నార్పకుండా చూస్తున్నాడు.

బాపుబొమ్మా, పికాసో పెయింటింగ్, మైఖెలాంజిల్ మధురోహ, ఎమ్.ఎఫ్. హుస్సేన్‌కల, ఫలక్‌నూమా ప్యాలస్ పాలరాతి విగ్రహం.... జీవం పోసుకుందా? సజీవమైన కళ్ళెదుట నిలిచిందా? ఏ గంధర్వకన్యో అటుగా ఆకాశమార్గాన ప్రయాణిస్తూ మడికెరి అందాలకు మతిపోగొట్టుకుని దిగిందా? కామోసు..... అన్నట్లుగా ఉన్న మహతిని చూసి మధుకర్ తన మతిని పోగొట్టుకున్నాడు.

వర్షంనుంచి తలదాచుకోటానికి వచ్చిన మధుకర్ ఆ విషయాన్నే మర్చిపోయాడు.

“ఏమైందిరా వీళ్ళకు? మొన్నటిదాకా తెగ ప్రేమించేసుకున్నారు. ఇప్పుడేమో అపరిచితుల్లా మసలుతున్నారేమిటి?” విజయ్ వాళ్ళిద్దరికేసి చూస్తూ ఆశ్చర్యపోతూ అన్నాడు.

“అదే నాకు అర్థం కావడంలేదు. పోనీ చనువుగా అడుగుదామా అంటే... ఇద్దరూ ఉన్నంతసేపు ఫ్రెండ్లీగా వుంటారు. లేదంటే గంభీరంగా వుంటారు. వాళ్ళకిష్టంలేని విషయం అడిగితే కోప్పడతారు” అన్నాడు సురేష్.

“ఏమిటి, కదలరా...” ఎకనామిక్స్ లెక్చరర్ మందలిస్తున్నట్లుగా అన్నాడు.

నిధిదయాళ్ చూపుడువేలితో మహతిని చూపించాడు.

"మహతీ..... మహతీ...." లెక్చరర్ పిలిచాడు.

"కోర్టులో జవాన్ పిలిచినట్లు ఆ మాడ్యులేషన్ ఏమిటి...." ఎవరో ఒకరన్నారు.

అది అందరికీ వినిపించింది.

లెక్చరర్‌కి కూడా.

నిధిదయాళ్ నవ్వాడు కిసుక్కున.

"పీపాలా, ఏమిటిరా ఆ నవ్వు" లెక్చరర్ విరుచుకుపడ్డట్లుగా అన్నారు.

మొత్తం మీద మరో అయిదునిమిషాలకు కదిలి కర్నాటక స్టేట్ టూరిజమ్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన గెస్ట్‌హౌస్‌లో విడిదిచేశారు.

వర్షం పెరిగింది. సాయంత్రమయింది.

మంచు పొగ మరింత సాంద్రతని పెంచుకుంది. వర్షం జోరున కురవటం ఆరంభించింది. "సంవత్సరకాలంలో ఆరేడు నెలలు జూన్ నుండి డిసెంబర్ వరకు వాతావరణం యింతే, జనవరినుండి మార్చివరకు విపరీతమైన చలి, మంచు. కేవలం ఏప్రిల్, మే నెలలే ఒకింత పొడిగావుండేది" లెక్చరర్ చెప్పుకుపోతున్నాడు.

ఫైర్ ప్లేస్‌నుండి వేడి వస్తోంది.

అందరూ ఆ వెచ్చదనాన్ని అనుభూతిస్తున్నారు. చీకటి దుప్పటి సాయంత్రమవుతూనే ఆ ప్రాంతాన్ని కప్పేస్తుంది. ఆ పైన దట్టమైన పొగ మంచు, ఫాగ్‌లైట్స్ లేకుండా వెహికిల్స్ అంగుళమైనా కదలవు.

అందరూ ఫైర్‌ప్లేస్ ముందు గుమికూడివుంటే, మహతి మాత్రం వారికి దూరంగా కూర్చుని మంటకేసే తదేకంగా చూస్తోంది.

మధుకర్ తనను తాను సమీక్షించుకుంటున్నాడు. లెక్చరర్ చెప్పుకుపోతున్నాడు.

"ది రిచ్చెస్ట్ క్రాప్.... అంటే కాఫీనే పర్ ఇయర్ ఒక్కోసారి ఎకరాకి లక్షరూపాయల ఆదాయం కూడా రావచ్చు. దానికి తోడు మిరియాలు, యాలకులు, జీడిపప్పు, కమలాలు సెకండరీ క్రాప్‌గా పండిస్తుంటారు.

పడిన చినుకు పడినట్లు జారిపోయే ఈ ఎర్రమట్టి కొండల్లో బంగారం పండుతోంది. లో టెంపరేచర్. నీరుని జార్చే వాలువున్న కొండలు, చలి, మంచు కాఫీ తోటలకి శ్రేష్ఠం.

ఇక్కడవారిమీద బ్రిటిషర్స్ ప్రభావం ఎక్కువ.

రాజసం, హుందాతనం ఇక్కడ ప్రతివారితో కనిపిస్తాయి.

దక్షిణ భారతదేశీయుల్లాగే కూర్గీస్‌కూడా ద్రవిడియన్ రేస్‌నుండి వచ్చినవారే.

17 వ శతాబ్దం వరకు వీరి ప్రిన్సిపల్ లాంగ్వేజ్ కొడగు.

హాలెరీ రాజుల కాలంనుంచి కొడగుభాష -- మలయాళం, కన్నడ భాషల ప్రభావానికి గురయింది. ఆ తరువాత మలయాళం భాష ప్రభావం తగ్గిపోయి, విచిత్రమైన సమ్మేళనాన్ని సంతరించుకుంది.

ఇంట్రస్టింగ్ అమాల్గమేషన్ ఆఫ్ నైబరింగ్ లేంగ్వేజెస్.... లైక్ తుళు, తెలుగు, కన్నడ, తమిళం అండ్ మలయాళం.

ఇక్కడి ప్రజల ప్రధాన వృత్తులు రెండే...ఒకటి మిలటరీలో చేరడం, రెండు వ్యవసాయం.

మనలాంటి పేదరైతుల అరా, కొరా వ్యవసాయంకాదు. ఆల్ హైలీ రెమ్యునరేటివ్ క్రాప్స్. లక్షలు తెచ్చిపెట్టే పంటలు.

ఇక్కడ రైతులు మారుతీ, 118, కంటెస్సా డిక్కీల్లో ఎరువులు, ఫెస్టిసైడ్స్ వేసుకొని వెళ్తారు.

బాగా తింటారు, తాగుతారు కూడా. ప్రతి ఒక్కరి యింట్లో ఫైర్ ప్లేస్, డైనింగ్ టేబుల్స్, ఫోర్క్స్, డెలీషియస్ ఐటమ్స్, నేప్‌కిన్, టిష్యూపేపర్స్ వాడుతారు. వీరిమీదవున్న బ్రిటీషర్స్ ప్రభావం మూలంగానే వారి అలవాట్లుకూడా మారిపోయాయి.

చేతినిండా డబ్బు, ఇంటినిండా కార్లు. అయినా బాగా కష్టపడతారు.

ఇక్కడ హీనాతిహీనంగా హేయంగా ఎవర్ని చూస్తారో తెలుసా? సోమరిపోతుల్ని. ఇక్కడి ప్రజలు ఒకరినుంచి ఒకరు అప్పుతీసుకుంటే ప్రామిసరీ నోట్స్ రాసుకోవటం ఉండదు.